## ప్రఖ్యాత కథా రచయిత శ్రీ చాసో సమర్పిస్తున్న మినీ కథల పరంపర




పినిశెట్టి శ్రీనివాసరావు

### "ఏరాకు ఏ పువ్వు అంటే ఇష్టం?"

"మల్లెలు - సంపెంగలు, మరి ఇష్టం లేనివీ వున్నాయ్."

"అవేమిటో?"

"మీరు - గీరు." అని నన్ను నువ్వ సంబోధించే తీరు."

"మరేలా పిలవాలేమిటి?"

"సినిమాలో హీరోయిన్‌లా, 'బావా' అని ముద్దుగా- తియ్యగా పిలవాలి. మరదలు పిల్లవు ఆమాత్రం తెలీదా?"

"అబ్బా- అలా పిలవాలంటే నాకు సిగ్గు ముంచుకొస్తుంది. పోనీ మన పెళ్ళయ్యాక అలానే పిలుస్తాను."

"అదేం కుదరదు. ఇప్పట్నించీ అలానే బావా అని పిలవాలి" అన్నాడు కృష్ణ.

అయినాసరె పెళ్ళవకుండా అలా పిలవటం, అదో 'ఇది'గా ఫీలయింది రాధ.

* * *

రాధా-కృష్ణల పెళ్ళి అయిపోయింది.

ఓ రోజు కృష్ణ బాత్రూంలో స్నానం చేసున్నాడు. ఇంతలో ఆఫీసు మెసెంజర్ వచ్చాడు.

"అయ్యగార్ని ఆఫీసరుగారు అర్జంటుగా పిలుచుకు రమ్మన్నారు" అన్నాడు మెసెంజర్.

"ఓ బావా నీకోసం మీ మెసెంజర్ వచ్చాడు" అంటూ బాత్రూంలో వున్న కృష్ణకు వినపడేలా అరిచింది రాధ.

మెసెంజర్ కిసుక్కున నవ్వుకున్నాడు.

* * *

ఆ రోజు మధ్యాహ్నం లంచ్ అవర్‌లో కొలీగ్ రామారావు. "బావా ఎప్పుడు వచ్చితివి నీవు?" అంటూ జోక చేశాడు కృష్ణను చూస్తూ. కృష్ణకు మతిపోయింది.

ఆ రోజు సాయంత్రం ఆఫీసునుంచి వచ్చాక.

"ఇదిగో, యికనుంచి 'బావ' అని పిలిచావంటే నీ నాలుక కట్ చేస్తాను. 'ఏమండీ' అని మర్యాదగా పిలుపు తెలిసిందా?" అన్నాడు కృష్ణ.

"అదేం బావా? నువ్వేగా అలా పిలవమన్నావ్?" అంది రాధ.

"అదంతే. అప్పుడు అలా పిలవమన్నాను. ఇప్పుడు వద్దంటున్నాను. చెప్పింది చెయ్యి" అన్నాడు కృష్ణ.

"అలాగేలెండి బావా... సారీ బావా.... బా....బా... బా....అబ్బబ్బ అలవాటైపోయింది. ఇప్పుడెలా?" అంటూ విసుక్కుంది రాధ.



Dattaram-NP-22

### ఆడదంటే



కందరి వెంకటరామయ్య

ఆ రోజు ఉదయం సుబ్బారావు ఆఫీసుకు రాగానే పోస్టులో అతనికొక ఉత్తరం వచ్చింది.

ఆ ఉత్తరం మనస్సులో కొంత అల

జడిని కూడా రేపింది. ఉదయం ఆఫీసుకు రాగానే సుబ్బారావుని అంతగా తికమక పెడుతున్న ఆ ఉత్తరానికొక ప్రత్యేకత లేకపోలేదు.

అది ఏ బంధువుల దగ్గరనించో లేక స్నేహితుల దగ్గరనుంచో వచ్చిన ఉత్తరం కాదు.

అయితే బొత్తిగా పరిచయం లేని ఓ అమ్మాయి రాసిన ఉత్తరం. పేరు 'ఛాయ' అట.

ఆ అమ్మాయికి తన ఎడ్రసు చెప్పిన వారెవరై వుంటారా అని కొంచెంసేపు ఆలోచనలో పడ్డాడు. ఆ ఉత్తరంలో ఆ అమ్మాయి కోరిన సహాయం ఏమంత చేయలేని దేమీకాదు. కాకుంటే తీరిక చేసుకొని ఓపిగ్గా ఓ రెండుమైళ్ళు యూనివర్శిటీకి సైకిలుపై వెళ్ళి రావాలి

ఆ వుత్తరం మరెవరి దగ్గరి నుంచైనా వచ్చివుంటే ఆఖరికి బంధువులైనాసరే అంతగా పట్టించుకొనేవాడుకాదు. కానీ, ఈ వుత్తరం విషయంలో త్వరగా ఒక నిర్ణయం తీసుకోలేకపోయాడు. అందుకు కారణం ఆ వుత్తరం రాసింది ఒకమ్మాయి కావడమే. కొంచెంసేపు ఆలోచించిన తరువాత ఆ అమ్మాయికి సహాయం చెయ్యాలనే నిర్ణయాని కొచ్చాడు.

సుబ్బారావు అలా నిర్ణయం తీసుకొన్న మరుసటి రోజే యూనివర్సిటీకి వెళ్ళి ప్రయివేటుగా ఎం. ఎ. పరీక్షకు కట్టడానికి కావలసిన అప్లికేషన్లు తదితర వివరాలు వగైరా సంపాదించి జాగ్రత్తగా సొంత ఖర్చులతో రిజిష్టరు పోస్టులో ఆ అమ్మాయి చెప్పిన అడ్రసుకు పంపించేశాడు.

ఆరోజునుంచీ సుబ్బారావు మనసునిండా ఆ అమ్మాయిని గురించిన ఆలోచనలు. అందులో కొన్ని పిచ్చిపిచ్చివి కూడా లేకపోలేదు.

ఆమెకు తాను పోస్టు చేసిన కవరు చేరగానే ఎంతో సంతోషంతో కృతజ్ఞతలు తెలియజేస్తూ ఉత్తరం రాస్తుంది. పైగా ఒకమ్మాయితో పరిచయం అంత సులభంగా దొరుకుతుందా?

ఇలాంటి ఆలోచనలతో సంబరంగా లెటరుకోసం ఎదురు చూడసాగాడు.

వారం రోజులు గడిచాయి.

ఒక రోజు ఉదయం సుబ్బారావు ఆఫీసుకు రాగానే అతనికొక లెటర్.

"డియర్ రావ్,

నువ్వెంతో శ్రమపడి పంపిన అప్లికేషన్లు తదితర వివరాలు వగైరా చేరాయి. ఇంతకుముందు నేను రాసిన రెండు జాబులకు నీ నుంచి జవాబు రాకపోయేసరికి మిత్రుడిగా చొరవ తీసుకొని ఇలా ఓ చిన్న తమాషా చేసి చూద్దామనుకున్నాను. నే ననుకున్నట్లుగానే నీ నుంచి మంచి రెస్పాన్సు వచ్చింది. పాపం 'ఛాయ'ను గురించి పిచ్చి పిచ్చి ఆలోచనలు వచ్చి వుంటాయనుకుంటాను. పరీక్షలు వ్రాయడానికి వచ్చినపుడే నిన్ను కలుసుకోవడం.

ఇట్లు మిత్రుడు,

—ప్రకాష్."

★

# సునీల్ గవాస్కర్ నాయకత్వాన భారత్ క్రికెట్ టీమ్ ఏర్పాటు



ఇండియా బ్యాట్స్‌మన్ సునీల్ గవాస్కర్ డిసెంబర్ 1 నుంచి బొంబాయిలో వెస్టిండీస్ - ఇండియా మధ్య జరగనున్న క్రికెట్ మ్యాచ్‌కి కెప్టెన్‌గా ఎన్నికైనారు.

పాకిస్తాన్‌పై ఆటి పరాజయం పొందిన భారతజట్టు నాయకుడుగా వున్న బిషన్ సింగ్ బేడి నుంచి నాయకత్వాని, గవాస్కర్‌కు ఇచ్చింది సెలెక్షన్ కమిటీ. వెస్టిండీస్‌పై ఆడే ఆరు మాచ్‌లకు గవాస్కర్ నాయకుడు.

ఈ జట్టులో సునీల్‌గవాస్కర్ (కెప్టెన్) చేతన్ చౌహాన్, మొహిందర్ అమరనాద్, జి. ఆర్. విశ్వనాథ్, దిలీప్‌వెంగ్ సర్కార్, సయ్యద్ కిర్మాని, కపిల్‌దేవ్, ఘావ్రి, బిషన్ సింగ్ బేడి, ఎస్. వెంకటరాఘవన్, బి ఎస్. చంద్రశేఖర్ వున్నారు. ధీరజ్ ప్రసన్న, యశ్‌పాల్‌శర్మ, భరత్ రెడ్డి, ఎక్స్ట్రా ఆటగాళ్ళుగా వుంటారు.

పాకిస్తాన్ జట్టులో ఆడిన సురేంద్ర అమరనాథ్ స్థానే వెంకట రాఘవన్‌ను ఎన్నిక చేశారు. ప్రసన్న, గైక్వాడ్‌లకు ఈ జట్టులో స్థానం కల్పించలేదు.

అంతర్జాతీయ రంగంలో సునీల్ గవాస్కర్ నాయకత్వాన క్రికెట్ జట్టు ఇండియాకి పేరుమంచి పేరు తేగలదని ఆశిస్తున్నారు

—కె. యల్.

